క్లుప్తంగా

రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనలు నడపవద్దన్నారు. అదే విధంగా సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బక సునీల్, పీర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం పరామర్శించారు. కుచులాపూర్ గ్రామానికి చెందిన సిరిపురం దాసు మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు ఇంద్రవెల్లికి ఎమ్మెల్సీ కవిత రాక

ఇంద్రవెల్లి: మండలంలోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఉదయం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరై అమరవీరులకు నివాళులర్పించనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు ఆది వారం తెలిపారు. అనంతరం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలంలోని ఆశ్రమ బాలికల పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శిస్తారని, అక్కడి నుంచి వాంకిడి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఫుడ్ పాయిజన్ అయి మృతిచెందిన విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించనున్నట్లు పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చాలి



జెండా పండుగలో పాల్గొన్న ముదిరాజ్‌లు

తలమడుగు: బీసీ డిక్లరేషన్‌తో పాటు ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మారుస్తానని ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ డిమాండ్ చేశారు. ఆదివా రం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ముది రాజ్‌ల జెండా పండుగ నిర్వహించారు. రాష్ట్ర ప్రధా న కార్యదర్శి సలేంద్ర శివయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ము దిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రివర్గంలో స్థానం నీలం మధు ముదిరాజ్‌కు ప్రభుత్వంలో ప్రత్యేక గుర్తింపు ఎమ్మెల్సీ, ఇతర పదవులు ఇవ్వాలన్నారు. నాయకులు మోతె శ్రీనివాస్, బైండ్ల రామన్న, బైండ్ల సుభాష్, గోనెల గంగన్న, బొజ్జ మోహన్, రమాకాంత్, బొజ్జ మచ్చేందర్, ఎలవేణి కృష్ణ, దర్శనాల నర్సింహులు పాల్గొన్నారు.

మాదిగలు డప్పు ప్రదర్శనకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: హలో మాదిగ.. చలో హైదరాబాద్ నినాదంతో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే డప్పు ప్రదర్శనకు మాదిగలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కాంబ్లే బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ముందుగా ముక్త సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిగలు ఎవరికి వారు సొంతంగా డప్పులు ఏర్పాటు చేసి ప్రదర్శనకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అందరే బాలాజీ, లింగంపల్లి రాజన్న, సూర్యవంశీ మాధవ్, రోడ్డ నర్సయ్య, సొంటకే నగేశ్, సాయన్న, కిషోర్, దీపక్ పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో కల్వర్టు నిర్మాణం

బోథ్: మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్ వద్ద మిషన్ భగీరథ ట్యాంకు వద్ద గల ఉన్న కాల్వ వల్ల రైతులు తమ చేనుల్లోకి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. కనీసం నడవరాని పరిస్థితి ఉండేది. కల్వర్టు నిర్మించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో రైతులు స్థానికుడు చట్ల ఉమేష్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే సొంత ఖర్చులతో పైపులను తెప్పించి కల్వర్టును నిర్మించారు. ఆదివారం కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

జంగీ జాతరకు ఏర్పాట్లు

- ఈనెల 23నుంచి ప్రారంభం
- బైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలతో మరూ
- 29న కాలదహి హండీతో ముగింపు



సదల్‌పూర్‌లోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాలు

బేల: ప్రతీ ఏటా పుష్యమాసంలో వారం రోజుల పాటు నిర్వహించే జంగీ జాతర ఈనెల 23 నుంచి ప్రారంభం కానుంది. ఏటా పుష్యమాసం నవమి రోజున ఈ ఆలయాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. వారం రోజుల పాటు కొనసాగించి, అమవాస్య రోజు కాలదహి హండీ నిర్వహించి జాతర ముగిస్తారు. కాగా ఈజాతర ఆదివాసీ పూర్వీకుల సాంప్రదాయబద్ధంగా 56 ఏళ్ల నుంచి నిర్వహిస్తుండగా.. గత 31ఏళ్ల నుంచి దర్బార్ సభ నిర్వహిస్తున్నారు.

ఆలయాల ప్రత్యేకత..

ఆదివాసీల ఆరాధ్య దైవమైన బైరందేవ్, మహాదేవ్ ఆలయాలు శాతవాహనుల కాలంలో నల్లరాతితో నిర్మించబడి, అందమైన శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. కాగా మనసులో ఏదైనా కోరుకొని బైరందేవ్ ఆలయంలోని లింగాన్ని ఎత్తితే లింగం తేలికగా లేస్తుందని భక్తులు నమ్మకం. ఈ ఆలయాలకు ఆదివాసీలే కాకుండా సోమ, మంగళ, గురు, శని, ఆది వారం రోజులలో ఇతర భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. మండలం నుంచే కాకుండా జైనథ్, నార్నూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, ఉట్నూర్ మండలాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి సైతం ఈ ఆలయాల దర్శనం కోసం వస్తుంటారు. ఈ ఆలయాలు అటవీకి సమీపాన ఉండి, ఆనాదిగా ఆదివాసీలు జాతర కొనసాగించడంతోనే జంగీ జాతర అని పిలుస్తుంటారు.

జాతర షెడ్యూల్ ఇలా..

ఈనెల 23న జాతర ప్రారంభం కానుంది. 26 నుంచి కబడ్డీ పోటీలు ప్రారంభం, 27న ఆదివాసీ దర్బార్ సభ, 29న కాలదహి హండీ నిర్వహణతో జాతర ముగింపు ఉండనుందని ఆలయ కమిటీ వారు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టనున్నారు. క్యూలైన్ కోసం, ఆలయాల చుట్టూ రద్దీ నియంత్రించేందుకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక జాలి ఏర్పాటు చేయనున్నారు. జాతరకు వచ్చే భక్తులకు నీటి సౌకర్యం, విద్యుదీకరణ ఏర్పాట్లు చేయనున్నారు.

మారని ఆలయాల రూపురేఖలు..

ఈ ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ఆలయాల మరమ్మతు నిర్మాణ పనుల అభివృద్ధి కోసం కమిటీ వారు గత 13ఏళ్ల క్రితం దేవదాయ శాఖ అధికారులకు విన్నవించారు. అధికారులు సైతం వచ్చి చూసి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఏడాదిన్నర క్రితం ఆలయాలను పరిశీలించినప్పటికీ, ఇంత వరకు శిథిలావస్థలో ఉన్న ఆలయాల అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. బైరందేవ్ ఆలయ శిఖర భాగం ఒక్కొ రాయి కూలుతున్నదని, ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భక్తులు భయాందోళన చెందుతున్నారు. మరోప్రక్క మహాదేవ్ ఆలయం లోపల వర్షానికి కురియడంతో మండలానికి చెందిన పలువురు భక్తులు ప్రత్యేక చొరవతో రెండేళ్ల క్రితం ఆలయం పైభాగానికి మరమ్మతులు చేయించారు.

అన్నదాతకు సాగు భారం..!

- ఏటా పెరుగుతున్న కూలి రేట్లు
- కూలీల కొరతతో ఇబ్బందులు



శనగ పంట

నేరడిగొండ: పంటల సాగు అన్నదాతలకు భారంగా మారుతోంది. ఏటేటా పెరుగుతున్న కూలీల కొరతకు తోడు.. కూలి పెంపు కూడా వారిని అయోమయానికి గురిచేస్తోంది. ఇటు నమ్ముకున్న సేద్యాన్ని వదులుకోలేక.. మరోవైపు పెరుగుతున్న పెట్టుబడులు భరించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితి ముఖ్యంగా నాలుగేళ్లుగా తీవ్రమవుతోంది. దున్నడం మొదలు.. విత్తడం.. కలుపు తీయడం.. పంట కోయడం వరకు కూలీలతోనే పని. ఈ క్రమంలో వ్యవసాయ పనులు చేసే వారు దొరక్క రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

కూలీలకు డిమాండ్..

సాగులో ముఖ్యపాత్ర కూలీలదే. వారు లేకుంటే ఏ పనీ సాగదు. అయితే వారికి రోజువారీ కూలీ అమాంతం పెరుగుతోంది. నాలుగేళ్ల క్రితం ఉన్న రేట్లతో పోల్చితే రెట్టింపు అయ్యింది. మూడేళ్ల క్రితం కూలీ రోజుకు రూ.250 నుంచి రూ.300 ఉంటే.. తాజాగా అది రూ.500కు చేరింది. రైతులందరూ ఒకేసారి సాగుకు సిద్ధపడుతుండడంతో కొన్నిసార్లు కూలీల కొరత తీవ్రమవుతోంది.

వ్యవసాయేతర పనులకు కూలీలు..

మొన్నటి వరకు గ్రామాల్లోని కూలీలు వ్యవసాయ పనులకు వచ్చేవారు తాజాగా వ్యవసాయేతర పనుల వైపు వెళ్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ కూలీ వచ్చేలా చూసుకుంటున్నారు. చాలా మంది మహిళలు కుట్లు, అల్లికలు వంటి పనులు చేస్తుండడంతో వ్యవసాయ పనులు చేసేవారు తగ్గుతున్నారు. మరోవైపు కూలీల వలసలను నివారించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం కూడా కూలీల కొరతకు కారణమవుతోంది.

సేద్యానికి అనుసంధానిస్తే..

సేద్యానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే పండ్ల తోటల పెంపకం, కందకం తవ్వకాలు, ఎస్సీ, ఎస్టీల భూముల చదును చెరువులు, కుంటల నుంచి మట్టి తరలింపు చేపడుతున్నా.. ప్రధానమైన నాట్లు, పత్తితీత, సోయా, శనగ, మొక్కజొన్న తదితర పంటల్లో కలుపుతీత వంటి పనులకూ అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

బోథ్: మండలంలోని పెద్దార్ల గుట్ట వద్ద గల హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఆలయ కమిటీ తీర్మానించింది. ఆదివారం ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఆలయంలో నవగ్రహ మండపం నిర్మాణం, ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

నిర్వహణపై ఆలయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు

బేల: మండలంలోని సదల్‌పూర్ బైరందేవ్, మహాదేవ్ ఆలయాల ప్రాంగణంలో జంగీ జాతర నిర్వహణపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలపై, దుకాణాల ఏర్పాటు ప్రాంగణం శుభ్రతపై చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు మాట్లాడుతూ.. ఈనెల 23న ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలతో జాతర ప్రారంభమవుతుందన్నారు. 29న కాలదహి హండీ కార్యక్రమంతో జాతర ముగింపు ఉంటుందని తెలిపారు. 27న ఆదివాసీ దర్బార్ సభ, 26 నుంచి కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల వారు, ఆలయం వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా, జాతరలో విద్యుత్, నీటి వసతి కల్పిస్తామన్నారు. 15మంది యువకులతో వలంటీర్‌లతో సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావు, గౌరవ అధ్యక్షుడు కొరంగే దౌలత్ పటేల్, మాజీ ఎంపీటీసీ కొడపే అరుణ్, పెందుర్ రాందాస్, మెస్రం వాసుదేవ్, సలాం దేవ్‌రావు, నైతం సీతరాం, కొరంగే జంగ్షా, జనార్దన్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుగ్గరాం(బి) గ్రామంలో బుగ్గరాం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నిమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసకాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, రాథోడ్ సురేందర్, పాండు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి

అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు నిర్వహించిన వనదర్శిని కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం హరితవనంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. గ్రాస్ ల్యాండ్‌లో పిటి (నీటికుంట)ను కాలినడకన అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. సఫారీలో తిరుగుతూ సోలార్ బోర్‌వెల్‌తో పాటు అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం పార్డి గ్రామానికి చెందిన చిరుత పులి దాడిలో గాయపడ్డ చందర్ మహరాజ్‌కు పరిహారంగా రూ.31వేలు అందజేశారు. కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్ ఎఫ్ఆర్‌వోలు గణేష్, ప్రణయ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, అంబేకర్ పండరి, ఆదుముల్ల భూషన్, ఫయ్యాజ్, పాండు, రాథోడ్ సురేందర్, ఉప్పు పోశెట్టి పాల్గొన్నారు.

ఖేల్ కూద్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ

బజార్‌హత్నూర్: శ్రీ సరస్వతీ విద్యాపీఠము బైంసా సుభద్ర వాటిక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆదిలాబాద్ విభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీల్లో బజార్‌హత్నూర్ శ్రీ సరస్వతీ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. ఖోఖో బాలికల విభాగంలో ప్రథమ, ఖోఖో బాలురు విభాగంలో ద్వితీయ, కబడ్డీ బాలురు విభాగంలో ప్రథమ, కబడ్డీ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి పొందారు. 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ దొంతుల యశ్వంత్, 400 మీటర్ల పరుగు పందెంలో పద్వాల్ హారతి ద్వితీయ, 200 మీటర్ల పరుగు పందెంలో కొంగర్ల చైతన్య ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో క్యాతం అక్షిత ద్వితీయ, హైజంపులో కొంగర్ల చైతన్య ప్రథమ బహుమతులు గెలుపొందారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వొర్ని వెంకట రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాములు

కై లాస్‌నగర్: కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి బడ్జెట్ సాధించుకుంటే అధికారులు పెండింగ్ బిల్లులు, వేతనాలు, కోడిగుడ్డు బిల్లులను చెల్లించకపోవడం శోచనీయమని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు అన్నారు. ఎండీఎం కార్మికుల సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఎంఆర్సీ ఉద్యోగులు సమ్మెలో ఉన్నారని, పెండింగ్ బిల్లులను నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిల్లులివ్వకుంటే పిల్లలకు తామేలా భోజనం పెట్టాలని ప్రశ్నించారు. ఎండీఎం కార్మికులకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకులు కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సమావేశంలో నాగమణి, పుష్ప, శశికళ, రాంబాయి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బజార్‌హత్నూర్: ఆదర్శ పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తోంది. ఆసక్తి గల విద్యార్థులు ఆదర్శ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సంగీత ఆదివారం కోరారు. 100 మంది బాలికలకు ఆదర్శ పాఠశాల వసతి గృహంలో వసతితో కూడిన విద్యను పొందుటకు అవకాశం ఉంది. ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్టీ లాంఛనాలతో రోకండ్ల రమేశ్ అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రోకండ్ల రమేశ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని జీఎస్ ఎస్టేట్‌లో అంత్యక్రియలు నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న హాజరై పాడే మోశారు. అంతకుముందు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

సమీక్ష సమావేశం విజయవంతం చేయండి

నేరడిగొండ: ఏఐసీసీ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో జరిగే ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, టీపీసీసీ సెక్రెటరీ సత్తు మల్లేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నాగోబా విద్యార్థి నిలయం ఏర్పాటు అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లి: వనవాసీ కల్యాణాశ్రమం ఆధ్వర్యంలో నాగోబా విద్యార్థి నిలయం ఏర్పాటు అభినందనీయమని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నాగోబా విద్యార్థి నిలయంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమానికి అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాగోబా విద్యార్థి నిలయంలో చదువుతున్న నిరుపేద విద్యార్థులపై విద్యార్థి నిలయం నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారు ఉన్నతస్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. చుట్టూ ప్రహరీ లేదని, సమస్యలను పరిష్కరించాలని కమిటీ సభ్యులు ఎంపీ గోడం నగేశ్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అఖిల భారతీయ ఉపాధ్యక్షుడు హెరేకుమ్ర నాగు, జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు, నాగోబా నిలయం అధ్యక్షుడు డొంగ్రె మారుతి పటేల్, ఉపాధ్యక్షుడు మెస్రం జంగు, తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లుకు అడ్డుకట్టేది..?

- రోజురోజుకూ పెరుగుతున్న విక్రయాలు
- లైసెన్స్ లేని షాపుల్లోనూ అమ్మకాలు
- మొక్కుబడిగా బైండోవర్లు



కల్తీ కల్లు

నేరడిగొండ: కల్తీకల్లు విక్రయాలను అరికట్టాలని ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ నుంచి జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. అయితే ఇచ్చోడ ఎక్సైజ్ అధికారులు మొక్కుబడిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కల్తీకల్లు విక్రయాలు జరిపేవారికి వంతపాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని బుగ్గారం, నాగమల్యాల్, గుత్పాల, కొరిటికల్, లింగట్ల, వాగ్ధారి, తర్నం, తేజాపూర్ గ్రామాల్లో లైసెన్స్ లేకున్నా కల్తీ విక్రయాలు జరుగుతున్నాయి. వీటికి ఏ మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఇక లైసెన్స్‌ల పేరుతో విర్రవీగుతున్న నేరడిగొండ, కుమారి, వాంకిడి, వడూర్, కుంటాల, బుద్దికొండ, కుప్టి గ్రామాల కల్లు వ్యాపారులు డైజోఫాం క్లోరోఫాం, ఆల్ప్రోజోలం వంటి రసాయనాలు కలుపుతున్నారు. మండలంలో మచ్చుకైనా కనిపించని తాటి, ఈతచెట్లు ఎక్సైజ్ అధికారుల లెక్కల్లో మాత్రం వందల వేల సంఖ్యలో ఉన్నాయి. ఇటీవల ఎక్సైజ్ అధికారుల బృందం మండలంలో పర్యటించింది. అయితే ప్రభుత్వం కేవలం గుడుంబా నిషేధించమని ఆదేశించిందని చెప్పడం కొసమెరుపు. అంతేకాకుండా గుడుంబా రహిత గ్రామమని బలవంతపు తీర్మానాలు కూడా రాయించుకున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు ఉదయం, సాయంత్రం కల్తీ కల్లు తయారు చేసి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్టుగా వదిలేయడంతో కల్తీ విక్రయాలకు అడ్డుకట్ట పడడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే చెత్తాచెదారం



ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామ సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను ఊరికి దూరంగా వేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అధికారులు ఊరికి దగ్గరలో సర్వీసు రోడ్డుకు అనుకొని చెత్తను వేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – ఇచ్చోడ

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం



సన్మానిస్తున్న మౌనిష్‌రెడ్డి దంపతులు

కై లాస్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని సామాజిక కార్యకర్త ముదుపు మౌనిష్ రెడ్డి అన్నారు. తన జన్మదిన వేడుకలను ఆదివారం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నడుమ జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఆర్‌వో జాదవ్ కృష్ణ, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.